క్లుప్తంగా

బీమా చెక్కులు అందజేత



నారాయణఖేడ్: చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలం జంబికుంటకు చెందిన తాటికొండ సంగారెడ్డి, సిర్గాపూర్ మండలం ఖాజాపూర్‌కు చెందిన ఆరె రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ సందర్భంగా వారు బీఆర్‌ఎస్ సభ్యులైనందున బీమా కింద ఒక్కొక్కరి కుటుంబానికి రూ.2లక్షల చొప్పున మంజూరు అయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కులను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఖేడ్ మాజీ ఎంపీటీసీ ప్రభాకర్ కురుమ తండ్రి కురుమ ఆకాశంసేట్ అనారోగ్యంతో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా భూపాల్‌రెడ్డి వెళ్లి పరామర్శించారు.

దివ్యాంగుల అభివృద్ధికి తోడ్పడుదాం



ఆత్మగౌరవ అవగాహన ర్యాలీలో దివ్యాంగులు, విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: దివ్యాంగులను గౌరవిద్దాం ... వారి అభివృద్ధికి తోడ్పడదామని ఇస్నాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి దివ్యాంగులు ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ లో దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు మహేష్, కార్యదర్శి జ్యోతితో కలిసి తెలంగాణ మస్కులర్ డిస్ట్రఫీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా ఇస్నాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని విద్యార్థులతో దివ్యాంగుల ఆత్మగౌరవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం దివ్యాంగుల పైన వ్యాసరచన పోటీలు నిర్వహించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుందర్ రావు, భాస్కర్,జయశ్రీ,దివ్యాంగులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకుడు

నారాయణఖేడ్: ఖేడ్‌లో శుక్రవారం స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుశాఖ సౌజన్యంతో బ్లడ్‌డోనర్స్ గ్రూపు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 30మంది యువకులు తమ రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజరు మాధవికోటం మాట్లాడుతూ యువకులు రక్తదానం చేయడం హర్షణీయం అని తెలిపారు. బ్లడ్‌డోనర్స్‌గ్రూపు సభ్యులు ముజాహిద్‌చిస్తీ, బ్యాంకు అసిస్టెంట్ మేనేజరు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా తవ్వకాలు

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలో జియో కనెక్షన్ కోసం తవ్వకాలను ఇష్టానుసారంగా చేపడుతున్నారు. ఝరాసంగం మండల కేంద్రంలోని సంగం కె రహదారి మధ్యలో జేసీబీ సహాయంతో పైప్లైన్ పనులు చేపట్టారు. అందులో భాగంగా గ్రామాల్లో మంచినీటి సరఫరాకు ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైపులు పలుచోట్ల పగిలిపోయి నీరు వృథాగా పోతోంది. అంతేకాకుండా తవ్వేసిన మట్టి కుప్పలు ప్రధాన రోడ్డుపై వేయడంతో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొన్నారు. పనులు నడుస్తున్న సమయంలో సూచికంగా ఎలాంటి బోర్డులో ఏర్పాటు చేయలేకపోయారు. సంబంధితశాఖ అధికారులు చర్యలు తీసుకొని పనులు ప్రణాళిక బద్ధంగా చేపట్టి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

నూతన ప్రభుత్వానికి సహకారం అందిస్తాం

సంగారెడ్డి టౌన్: నూతన ప్రభుత్వానికి టీఎన్జీవో తరఫున పూర్తి సహకారం అందిస్తామని టీఎన్జీవో అధ్యక్షుడు జేఏసీ చైర్మన్ జావీద్‌అలీ అన్నారు. టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి మారం జగదీశ్వర్ పిలుపుమేరకు, నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి టీఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో మిఠాయిలు పంచి పెట్టి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జావీద్ అలీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వానికి మంచిపేరు తెస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ఏఈ తీరుపై సభ్యుల ఆగ్రహం

- గ్రూపు రాజకీయాలు చేయొద్దని హితవు
- ఎంపీటీసీ, పీఆర్ఏఈ మధ్య వాగ్వాదం
- సమస్యలు పరిష్కరించాలని సభ్యుల డిమాండ్



మాట్లాడుతున్న ఎంపీపీ చైతన్యరెడ్డి

పుల్‌కల్(అందోల్): మండల పంచాయతీరాజ్ ఏఈ ఇష్టారీతిగా విధులు నిర్వర్తిస్తూ ప్రజాప్రతినిధులకు గ్రామాభివృద్ధిపై సమాచారం ఇవ్వకుండా పనులు చేపడుతున్నారని పలువురు ఎంపీటీసీలు మండిపడ్డారు. ఎంపీపీ చైతన్యరెడ్డి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్పోల్ ఎంపీటీసీ వీరాగౌడ్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఏఈ పనితీరును ఎండగట్టారు. పీఆర్ఏఈ గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని విమర్శించారు. అభివృద్ధి పనులు ఇష్టారీతిగా చేపడుతుండటంతో గ్రామాల్లో ప్రజలకు జవాబు చెప్పలేకపోతున్నామని వాపోయారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రజాప్రతినిధులతో గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. పీఆర్ఏఈ పనితీరు మార్చుకోకపోతే ఆందోళన చేస్తామన్నారు. దీంతో ఏఈ, ఎంపీటీసీ మధ్య వాగ్వాదం జరగడంతో ఎంపీపీ చైతన్యరెడ్డి, పీడీఓ విజయలక్ష్మి జోక్యం చేసుకుని ఇరువురికి నచ్చజెప్పారు. దీంతో వివాదం సద్దు మనుగడంతో తదుపరి శాఖలపై సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని త్వరగా తరలించాలని మిన్‌పూర్ ఎంపీటీసీ దుర్గయ్య సూచించారు. వర్షాలు కురుస్తున్నందునా ధాన్య రవాణాలో వేగం పెంచాలని పేర్కొన్నారు. ఉద్యానవన శాఖలో పండ్ల తోటల పెంపకానికి రాయితీలు ఇస్తున్నామని హార్టీకల్చర్ ఏడీ కీర్తి సభ్యులకు సూచించారు. తయారైన కూరగాయల నారు అందుబాటులో ఉందన్నారు. మన ఊరు–మన బడి పథకం క్రింద పాఠశాలలను కూల్చివేసి కొత్త భవనాల నిర్మాణాల్లో జాప్యం జరుగుతుందని సభ్యులు వాపోయారు. సమావేశంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీటీసీలు శ్రీనివాస్‌చారి, ఏఓ చైతన్య పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం

- నియోజకవర్గం అభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



నారాయణఖేడ్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నియోజకవర్గంలో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక శుక్రవారం ఖేడ్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అప్పులు తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి పనులు ఉత్తర్వులకే పరిమితం అయ్యాయని తెలిపారు. మూడేళ్లుగా బిల్లులు పెడింగ్‌లో ఉండడం ద్వారా పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకురాకపోగా చిన్నచిన్న పనులు చేసిన సర్పంచ్‌లు అప్పుల పాలయ్యారని వాపోయారు. ఉపాధ్యాయుల నియామకాలు లేక చాలా తండాల్లో పాఠశాలలు మూతపడగా ఉచిత విద్య అందని ద్రాక్షగా మారిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ చెప్పింది చేసి చూపుతుందని, వంద రోజుల్లో ఆరుగ్యారంటీలతో పాటు మెనిఫెస్టోలోని అంశాలన్నింటినీ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. 9వ తేదీ నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభమవుతుందని తెలిపారు. నియోజకవర్గంలో ఖేడ్‌లో తన గెలుపుతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో వచ్చి ఆయనను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భోజిరెడ్డి, ముఖ్య నాయకులు సుధాకర్‌రెడ్డి, రమేష్ చౌహాన్, షాదుల్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి సమాధి దర్శించుకున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గెలుపొందాక శుక్రవారం మొదటిసారిగా నారాయణఖేడ్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన తల్లి పట్లోళ్ల గాళెమ్మ ఆశీస్సులు పొందారు. అనంతరం పంచగామలోని పీకేఆర్ ఘాట్‌లోని తండ్రి దివంగత పట్లోళ్ల కిష్టారెడ్డి సమాధిని దర్శించుకొని నివాళులు అర్పించారు. కొండాపూర్ హనుమాన్ ఆలయంలో, పట్టణంలోని దర్గాలను దర్శించుకున్నారు. ఆయన వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సుధకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణఖేడ్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేదార్‌నాథ్ ఆలయ ప్రధాన పూజారి శివలింగ్ స్వామి, అఖిల భారత సాధు సంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్ మాట్లాడుతూ అన్ని మాసాల్లో కార్తీకమాసం పవిత్రమైందన్నారు. ఈ మాసం శివకేశవులకు ప్రీతిపాత్రమైందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమరెడ్డి, గద్వాల్ సబ్ కలెక్టర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు. కల్యాణోత్సవాన్ని మలమంచి మోహన్ జోషి బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం నరసింహ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరితోపాటు తోట ప్రశాంత్ నేతృత్వంలో చిన్నారులు ప్రదర్శించిన పేరిణి నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమం సందర్భంగా కాటేపల్లి పద్మ, భూషణం దంపతులు మహాప్రసాదాన్ని అందించారు.

రుక్మిణి సత్యభామ ఆలయంలో పూజలు



సత్యనారాయణస్వామి వ్రతాలు చేస్తున్న భక్తులు

పటాన్‌చెరు టౌన్: ఉత్పన్న ఏకాదశిని పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రసాదం నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు.

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు సహించం



నిర్మాణాలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

నర్సాపూర్: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేది లేదని తహసీల్దార్ కమలాద్రి, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని 76 సర్వే నంబరులో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా, సొంత భూమిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామన్నారు. సొంత భూమిలో నిర్మాణాలకు నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి దరఖాస్తు చేస్తే అనుమతులు వస్తాయన్నారు. వారి వెంట మండల ఆర్‌ఐ ఫైజల్ ఉన్నారు.

కొనసాగుతున్న గ్రామ దేవతల పూజలు



గ్రామంలో పూజలు నిర్వహిస్తున్న సర్పంచ్ కీర్తన తదితరులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి ఎదుల్లాపూర్ గ్రామంలో గ్రామదేవతల ఉత్సవాలు జరుగుతున్నాయి. శుక్రవారం ఊరలమ్మ బొడ్రాయి, లింగమయ్య ప్రతిష్ఠ నిర్వహించడంతో పాటు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు సర్పంచ్ కీర్తన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్సవాలు ఈనెల 11 వరకు నిర్వహిస్తామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, ఉప సర్పంచ్ పాండురంగం, మాజీ సర్పంచ్‌లు వెంకటేష్, సునందరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కల్లూరి రాజు, యాదిరెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శేతారయ జాతర

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్న ఘణాపూర్ గ్రామంలో శ్రీ శేతారయ ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామానికి గురువుగా భావించే శేతారయ ఉత్సవాలు మూడు రోజులపాటు జరపడం ఆనవాయితీ. ఉత్సవాల్లో భాగంగా రాత్రి రథోత్సవం నిర్వహించారు. యువకులు స్వామి వారి రథాన్ని లాగడానికి పోటీ పడ్డారు. మఠం నుంచి స్వామి వారి సమాధి వద్దకు ఊరేగింపు కొనసాగింది. శనివారం స్వామివారి పల్లకీ సేవ (శావ) కార్యక్రమం జరగనుంది.

బెజ్జంకిని కరీంనగర్‌లో చేర్చాలి

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండలాన్ని కరీంనగర్ జిల్లాలో చేర్చాలని కోరుతూ ఆర్‌టీఐ ప్రచార కమిటీ చైర్మన్, టీజేవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాసూరి మల్లికార్జున్, నాయకులు ర్యాకం రాజు, ఉప్పులేటి శ్రీను, గాదెం మల్లికార్జున్ శుక్రవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. అలాగే మండల కేంద్రంలో ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమి, ఎల్‌పీఎస్ భూములపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మానవ హక్కులపై సందేశాన్ని ఇస్తున్న అధ్యాపకుడు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని తెలంగాణ రాష్ట్ర గిరిజన రెసిడెన్షియల్‌లో న్యాయ కళాశాలలో మన హక్కుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, మన రాజ్యాంగం హక్కు అని మానవహక్కులు ప్రపంచవ్యాప్తంగా మరింత గురించి చెప్పు పొందాయన్నారు. కళాశాల సిబ్బందికి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణనాయక్, అధ్యాపక బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వభారతి లా కళాశాలలో..

పటాన్‌చెరు టౌన్: మండలంలోని ముత్తంగి గ్రామ సమీపంలోని విశ్వభారతి లా కళాశాలలో 10వ తేదీ ఆదివారం సెలవుదినం కావడంతో ముందస్తుగా మానవహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానవహక్కులపై తమ సందేశం ఇచ్చారు. అనంతరం ప్రిన్సిపాల్ భవాని మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎలాంటి వివక్ష లేకుండా సమాన హక్కులతో జీవించాలని ఐక్యరాజ్యసమితి 1948 డిసెంబరు 10న పారిస్ వేదికగా సభ్య దేశాలన్ని ఓ కీలక ఒప్పందంపై సంతకం చేశాయని వివరించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లా కళాశాల అధ్యాపకులు అంబర్, గురుమూర్తి, వర్ష, రమ్య, కీర్తి, అన్వి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రగతిభవన్ పేరు మార్పుపై హర్షం

రామాయంపేట(మెదక్): ప్రగతి భవన్‌ను మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా మార్చడంపై బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం, సావిత్రిబాయి పూలే సంఘం జిల్లా అధ్యక్షురాలు పోచమ్మల అశ్విని హర్షం వ్యక్తం చేశారు. పూలే దంపతుల ఆశయాలను నెరవేర్చాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

భూ కబ్జాపై ఫిర్యాదు

శివ్వంపేట(నర్సాపూర్): సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో భూ కబ్జాపై ఫిర్యాదు చేసినట్లు ఓ రైతు తెలిపాడు. తనది మండలంలోని కొంతన్‌పల్లి గ్రామమని గొల్ల శివయ్య తెలిపాడు. కాగా వంశపారపర్యంగా గ్రామ పరిధిలో పంటలు సాగు చేసుకుంటున్న సర్వే నంబరు 349 లోని సర్వేనంబరు 1–37 గుంటల భూమిని బీఆర్‌ఎస్ నాయకుడు కబ్జా చేశాడని సీఎంకు వివరించినట్లు చెప్పాడు. భూ కబ్జాపై పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపాడు.

క్రీడాపోటీలను విజయవంతం చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని నల్లగండ్లలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులతో క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు తెల్లాపూర్ నైబర్హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాలనీవాసుల మధ్య మరింత ఐక్యత, స్నేహాన్ని పెంచాలనే లక్ష్యంతో తెల్లాపూర్ నైబర్హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 40 రోజులపాటు వివిధ కాలనీలలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఎనిమిది రకాల క్రీడా పోటీలు ఉంటాయన్నారు. 700 మంది క్రీడాకారులకు పైగా ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగులు

సంగారెడ్డి టౌన్: రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ శరత్‌ను కలిశారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినందుకు ఉద్యోగులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులోనూ రెవెన్యూకు సంబంధించిన కార్యక్రమాలను విజయవంతంగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గరుడవాహన పూజ

మునిపల్లి(అందోల్): జీవన్ముక్త సంస్థానం ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జీవన్ముక్త సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్ గరుడ వాహన పూజను నిర్వహించారు. అంతకుముందు పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులతో పాటు జీవన్ముక్త మహారాజ్‌కు సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్ వివిధ పూజలు నిర్వహించారు. గరుడ వాహనంతో సంస్థాన దేవాలయం చుట్టూ భక్తులు భజన నిర్వహిస్తూ భక్తిపాటలు పాడారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



నస్కల్ గ్రామంలో..

కొల్చారం(నర్సాపూర్): మండల పరిధిలోని రంగంపేట గ్రామంలో శుక్రవారం గ్రామానికి చెందిన కృష్ణ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణ, భజనలు, కీర్తనలతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పడిపూజలో గురుస్వాములు ప్రభాకర్ గుప్తా, శ్రీనివాస్ గుప్తా, రాచప్ప, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో శుక్రవారం గురుస్వామి తీగల ఎర్రగౌడ్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ రేణుక ఆలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి శబరిమలై అయ్యప్ప దేవాలయ సహాయ అర్చకుడు, గురుస్వామి ఉన్నికృష్ణన్ నంబూద్రి హాజరయ్యారు. కార్యక్రమంలో గురు స్వాములు, గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప పడిపూజచేస్తున్న స్వాములు

సమాచారం లేకుండా కార్యాలయం ప్రారంభించారు

- ఉప సర్పంచ్ ధర్మేందర్ ఆరోపణ

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కోనాయపల్లి(పీటీ)లో గడా నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తమకు సమాచారం లేకుండా ప్రారంభించారని సర్పంచ్ ప్రభావతి ప్రారంభించారని ఉప సర్పంచ్ ధర్మేందర్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తనకు సమాచారం ఇవ్వకుండా నూతన పంచాయతీ భవనం ఎలా ప్రారంభిస్తారన్నారు. సర్పంచ్‌ని వివరణ కోరగా పాలకవర్గం కోరిక మేరకే ప్రారంభించామని తెలిపారు.

డ్రగ్స్ తయారీపై కలకలం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని కొడకంచి గ్రామ శివారులో డ్రగ్స్‌ను తయారు చేస్తుండటం కలకలం రేపింది. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్, నిర్మల్‌గౌడ్, శివశంకర్‌గౌడ్ డ్రగ్స్ తయారీ వ్యవహారంలో ఉండటంతో గ్రామంలో చర్చనీయాంశమైంది. ఓ పార్టీకి చెందిన ముఖ్య అనుచరులు ఈ డ్రగ్స్ దందా నడుపుతున్నారని మండల వ్యాప్తంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. డ్రగ్స్ తయారీకి సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు గ్రామస్తులు వెనకాడుతున్నారు. ఈ డ్రగ్స్ దందా వ్యవహారం మరికొందరు నాయకుల మెడకు చుట్టుకుంటుందని పలువురు చర్చించుకుంటున్నారు.